# శేషప్రశ్న

రాఘవ మొదట్నుంచీ చదువుకంటే, ఆటల్లోనే అధికాసక్తి కనబర్చేవాడు. కాలేజీకి వచ్చాక, ఆటలపట్ల ఆసక్తి ఇనుమడించింది. పరుగు పందేల్లోనూ, క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ ఆటల్లోనూ ప్రతిభ కనబర్చడమే గాకుండా, ఎన్నో బహుమతులూ గెల్చుకున్నాడు. ముఖ్యంగా, పరుగుపందెంలో, అతనికి సాటి ఎవరూ లేరనిపించుకున్నాడు.

రఘుపతి, రాఘవకి మంచి స్నేహితుడు, అయితే, రఘుపతి, రాఘవకి భిన్నమైనవాడు. రఘుపతికి, చదువులో ఆసక్తి మెండు. ఎప్పుడూ ఫస్టుక్లాసు మార్కులే తెచ్చుకునేవాడు. దానికితోడు రచనా వ్యాసాంగంలో ప్రవేశమున్నవాడు. గేయాలు, కథలూ రాసేవాడు. ఏదో రాద్దామన్న తపన అతనిలో వుండటం వల్ల, సాహిత్యం పట్ల ఆసక్తి ఇనుమడించింది.

అయితే స్నేహితులు ఇద్దరికీ ఉద్యోగాలు లేవు. రఘుపతి ఆర్థికంగా పరిపుష్టిగలవాడు. తనకి ఉద్యోగం దొరక్కపోయినా, ఉద్యోగం ఎంతో అవసరం వున్న రాఘవకి దొరికితే తను సంతోషిస్తాడు... అనేవాడు రఘుపతి. కానీ అదీ జరగడం లేదు.

వాళ్ళిద్దరూ ఒక సెలక్షనుకి వెళ్ళారు. వారి లాంటి అభ్యర్థులు ఎంతో మంది వున్నా, వ్రాత పరీక్ష లో పాసైన వాళ్ళు, చాలా తక్కువమంది, అలా పాసైనవారిలో రఘుపతి, రాఘవ ఇద్దరూ వున్నారు.

ఇంటర్వ్యూకి రమ్మని, ఇద్దరికీ ఉత్తరాలు వచ్చినయ్. ఒకేరోజు, ఒకేచోట జరుగుతాయి ఇంటర్వ్యూలు. ఇద్దరు స్నేహితులూ, ఎదుటివారి విజయాన్నే కాంక్షిస్తున్నారు.

"ఒరేయ్ రఘుపతి! ఈ పరీక్షలో నువ్వు తప్పకుండా నెగ్గి, ఉద్యోగానికి అర్హుడవవుతావన్న నమ్మకం నాకుందిరా! నీ తెలివి తేటలు నాకెక్కడివి?" అన్నాడు రాఘవ.

రఘుపతి సన్నగా నవ్వేశాడు.

"తెలివితేటలు, ఈ రోజుల్లో ఎవరికి కావాలిరా? వారికి కావల్సిన అర్హతలు వేరుగా వుంటాయి. ఆటల్లో ప్రతిభ వున్నవాడివి కాబట్టి ఉద్యోగం వచ్చే అవకాశాలు నీకే మెండుగా వున్నాయి. నేను

కాంక్షించేది కూడా నీ విజయమేన్రా" అన్నాడు రఘుపతి.

"అలా అనకురా రఘుపతీ! తెలివైన వాళ్ళని విజయలక్ష్మి వరించడమే ధర్మం" అన్నాడు రాఘవ.

"మనదేశంలో, అటువంటి ధర్మాలకి తావులేదురా! ప్రత్యేకమైన పద్ధతులు కొన్ని వున్నాయి. సరే! ఎలాగూ ఇంటర్వ్యూకి వెళ్తున్నాంకదా, ఏం జరుగుతుందో, ఎవరి అంచనా నిజమవుతుందో చూద్దాం" నవ్వుతూనే అన్నాడు రఘుపతి.

రాఘవ ఓ చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

✪ ✪ ✪

ఆరోజే ఇంటర్వ్యూ జరుగుతుంది. తమాషా ఏమిటంటే, రాఘవ, రఘుపతిల పేర్లు వరుసగా వున్నాయి. ఇంటర్వ్యూకి వచ్చిన అభ్యర్థుల సంఖ్య సుమారు అరవై వరకూ వుంటుంది. వారిలో రాఘవ సీరియల్ నెంబరు 12 అయితే, రఘుపతి నెంబరు 13.

మొదట రాఘవనే పిల్చారు.

రాఘవ లోపలికి వెళ్ళి సెలెక్షన్ బోర్డులో వున్న ముగ్గురికి వినయంగా నమస్కరించాడు.

"కూచోండి...." అన్నాడో మెంబరు.

రాఘవ, వాళ్ళకి అభిముఖంగా కూచున్నాడు.

"మీ పేరు?"

"రాఘవ సార్..."

'మీ సర్టిఫికేట్లు ఇలా ఇవ్వండి" మరో బోర్డు మెంబరు అడిగాడు.

"ఇవిగోండి సార్..." అంటూ ఫైలు అందించాడు రాఘవ.

'ఔనూ, బి.కామ్‌లో మార్కులు అంత ఆకర్షణీయంగా లేవేమిటి?" ప్రశ్నించాడో మెంబరు.

రాఘవ ఊహించిన ప్రశ్నే ఎదురయ్యింది. అయితే, అతను నీరసపడిపోలేదు.

"నాకు క్రీడారంగం పట్ల శ్రద్ధ ఎక్కువసార్! ఆటలకే అధిక సమయాన్ని వెచ్చిస్తూ వుంటాను. ఆ కారణం వల్లనే, చదువులో ఆశించినంత స్థాయిని సాధించలేకపోయాను సార్" ఉన్నది వున్నట్టు చెప్పాడు రాఘవ.

'అట్లాగా! ఏ ఏ ఆటల్లో ప్రావీణ్యత వుంది?"

"పరుగుపందేల్లో ఎక్కువగా పాల్గొని ఎన్నోసార్లు ప్రథమ బహుమతుల్ని సంపాదించాను. అది గాకుండా, ఫుట్‌బాల్ పోటీలో మా కాలేజీ తరపున ఆడి, ప్రత్యేక బహుమతి పొందాను.

క్రికెట్‌లో కూడా ఆల్‌రౌండరుగా నాకు గుర్తింపు వుంది. వాలీబాల్ టీమ్‌కి కెప్టెన్‌గా వ్యవహరించాను. వీటికి సంబంధించిన సర్టిఫికెట్లు ఫైల్లో వున్నాయి. పరిశీలించవచ్చును సార్" అన్నాడు రాఘవ.

సెలక్షను బోర్డు మెంబర్లు ముగ్గురూ ఆ ఫైల్లోని సర్టిఫికెట్లు పరిశీలించారు.

" ఓ.కే. ఇక మీరు వెళ్ళొచ్చు..." అన్నాడో మెంబరు.

వాళ్ళకి అభివాదనచేసి, బయటికి వచ్చాడు రాఘవ, తర్వాత లోపలికి వచ్చిన అభ్యర్థి రఘుపతి.

"నమస్కారం సర్స్..." అన్నాడు రఘుపతి వినయపూర్వకంగా.

"నమస్కారం .... కూచోండి" అన్నాడో మెంబరు.

"థాంక్స్..." అన్నాడు రఘుపతి.

"మీ సర్టిఫికేట్స్ ఇవ్వండి..." అడిగాడో మెంబరు.

రఘుపతి తన ఫైలుని అందించాడు.

"బి.కామ్ ఫస్టుక్లాసులో పాసయ్యారా?" ప్రశ్నించాడో సెలక్షన్ బోర్డు మెంబరు.

"ఔను సార్! అందులో సర్టిఫికేట్ వుంది" జవాబిచ్చాడు రఘుపతి.

క్షణం తర్వాత-

"ఇదేవిఁటి? ఆటలకి సంబంధించిన ఒక్క సర్టిఫికేటూ లేదే?" విస్మయంతో అడిగాడు, ఒక సెలక్షన్ బోర్డు మెంబరు.

"ఆటలపట్ల నాకు ఆసక్తిలేదు సార్! సాహిత్యమంటే నాకు ప్రాణం. కవితలు, కథలు రాస్తూవుంటాను. నా రచనలు వివిధ పత్రికల్లో ప్రచురితమవుతున్నాయి" చెప్పుకుపోయాడు రఘుపతి.

సెలక్షన్ బోర్డు మెంబర్లు ముగ్గురూ పరస్పరం మొహాలు చూసుకుని నవ్వుకున్నారు. ఇటువంటి సంఘటన ఎదుర్కోవడం వారికి ఇదే ప్రథమం.

"మీ సాహితీకృషి మాకు అనవసరమండీ రఘుపతిగారూ! అదనంగా మీకు వుండే అర్హతలు మరేమైనా వున్నాయా?" ప్రశ్నించాడో మెంబరు.

"అంటే, టైపు, షార్టుహ్యాండ్, కంప్యూటర్... ఇటువంటి వాటిల్లో ఏమన్నా ప్రవేశం వుందా?"

"లేదు సార్!"

"సారీ! మీరు ఇహ వెళ్ళొచ్చు... " నిర్మొహమాటంగా చెప్పాడో మెంబరు.

రఘుపతికి తెలుసు. ఇలా జరుగుతుందని.

అందుకే అంతగా బాధపడలేదు... కోపమూ తెచ్చుకోలేదు. లేచి నిల్చున్నాడు.

"మీరు మరేమీ అనుకోకపోతే, నాదో ప్రశ్న సార్..." అన్నాడ సౌమ్యంగా.

"అడగండి...." స్పోర్టివ్‌గానే అన్నాడో మెంబరు.

"కవులకీ, రచయితలకీ, అసలు విలువే లేదంటారా సార్?" సూటిగా ప్రశ్నించాడు రఘుపతి.

సెలక్షను మెంబర్లు ముగ్గురూ గతుక్కుమన్నట్లు వాళ్ళ మొహాలే చెబుతున్నాయి.

"అని, మేం చెప్పలేం బాబూ! నీ ఆవేదనని అర్థం చేసుకున్నాం. అయితే, మాకు నిర్దేశింపబడిన ఆదేశాలకు కట్టుబడి మేం వుండాలికదా!

ఆటల్లో ప్రవేశముండి, ఒకస్థాయికి చేరుకున్నవారికి మాత్రమే, ప్రత్యేకమైన గుర్తింపు వుంటుంది. అంత వరకే మా పరిధి" అన్నాడు ముగ్గురిలో మధ్యన కూచునివున్న మెంబరు.

రఘుపతి మెల్లగా నవ్వేశాడు.

"నిజమే సార్ ! మీరేంచేస్తారు? మన దేశంలో అన్నీ ప్రత్యేకతలే. ప్రతిభతో పనుండదు. మిమ్మల్ని నిందించడం అనవసరం. మీకివ్వబడిన ఆదేశాల మేరకే మీరు వ్యవహరిస్తారు. మన వ్యవస్థ అటువంటిది.

క్రీడలు తప్పించి మరో కళకి స్థానం ఉండదు. అది మన దౌర్భాగ్యమేమో సార్ ! ధన్యవాదాలు సార్ !

"ఆ ఫైలు ఇలా ఇవ్వండి"

- అంటూ ఫైలు తీసుకుని నిష్క్రమించాడు బయటకి రఘుపతి.

సెలక్షన్ బోర్డు మెంబర్లు ముగ్గురూ పరస్పరం మొహాలు చూసుకున్నారు. 'అతను ఆవేశంలో అన్నా, అన్నదాంట్లో కొంత అర్థం వుందేమో !" అన్నాడు మధ్యనున్న వ్యక్తి. మిగతా ఇద్దరూ చిరునవ్వు నవ్వేశారు.

ఆ రోజు సాయంత్రం వరకూ ఇంటర్వ్యూ సాగింది.

రాఘవకి ఉద్యోగం వచ్చింది. ఆ ఉత్తరం పట్టుకుని రఘుపతి దగ్గరికి వచ్చాడు రాఘవ.

"రఘుపతీ! నేను సెలక్టయ్యాన్రా! నీకు ఏమీ రాలేదా?" అంటూ ఉత్తరం చూపించాడు రాఘవ.

" నాకు రాదని తెలుసురా రాఘవా ! నీకు తప్పకుండా ఉద్యోగం వస్తుందని ఆరోజే చెప్పాను. నీకు ఉద్యోగం వచ్చినందుకు నాకు ఎంతో ఆనందంగా వుందిరా ! నా అభినందనలు అందుకోరా... " సంతోషంతో అభినందనల్ని తెలిపాడు రఘుపతి.

'సారీరా ! నీకూ వచ్చి వుంటే బావుండేది..' నిరుత్సాహంగా అన్నాడు రాఘవ.

" ఫరవాలేదురా ! నీకు ఉద్యోగం రావడమే భావ్యం. నా గురించి నేనేం బాధపడ్డంలేదు. విష్ యూ ఆల్ ద బెస్టు రా' నవ్వుతూనే అన్నాడు రఘుపతి.

రాఘవకి ఉద్యోగం దొరికినందుకు రఘుపతిలో ఏ కోశానా అసూయలేదు. అణువణువునా అతనిలో ఆనందమే వుంది. అయితే, మన వ్యవస్థ పట్లే అతనికి ద్వేషం, ఈ పరిస్థితులు మారేదెప్పుడు ? ... అన్న ప్రశ్నే అతనిలో శేష ప్రశ్నగా మిగిలింది.

□□□

(స్వాతి వారపత్రిక 17.7.98)